క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన తూముల చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ హైదారాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించి పత్రాన్ని చంద్రయ్య కుమార్తెకు అందించారు. మాజీ ఏఎంసీ డైరక్టర్ రాంగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంపత్, గట్టయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు



నడికూడ : తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌రెడ్డిని మండలంలోని రేషన్ డీలర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు గడ్డం సర్వేశం, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సుమన్, డీలర్లు రమేశ్, అరుణ్‌కుమార్ ఉన్నారు.

పెరుంబిడుగు ముత్తరైయర్ జయంతి



ఐనవోలు : మండలంలోని 44వ డివిజన్ సింగారం అంబేడ్కర్ సెంటర్ వద్ద ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో పెరుంబిడుగు ముత్తరైయర్ 1350వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం కుల పెద్దలు ముత్యాల నాగరాజు, ఇండ్ల కుమారస్వామి ముత్తరైయర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే పుష్కర స్నానం

నర్సంపేట : దక్షిణ భారతదేశ త్రివేణి సంగమంగా గుర్తింపు పొందిన కాళేశ్వరంలోని సరస్వతీ పుష్కరాల్లో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా స్నానం ఆచరించారు. నదీ తీరంలో దీపారాధన నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయంలోనూ ఆయన కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆలయంలో పూజలు

నల్లబెల్లి : మండల కేంద్రంలోని అభయాంజనేస్వామి ఆలయంలో అఖిల భారత హనుమాన్ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, శ్రీరామ ధర్మ ప్రచారకుడు గాదెపాక రాములు స్వామి శుక్రవారం పూజలు నిర్వహించారు. తొలుత అఖండ జ్యోతిని వెలిగించారు. పహల్గాం ఉగ్రవాదుల దాడిని ఖండించారు.

సొసైటీ మాజీ చైర్మన్ మృతి

నర్సంపేట : చెన్నారావుపేట సొసైటీ మాజీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. చైర్మన్‌గా ఆయన రైతులందరికీ ఎనలేని సేవలు అందించారు. ఆయన మృతితో మండలంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సత్యనారాయణరెడ్డి మృతదేహానికి పలువురు నాయకులు, ప్రముఖులు నివాళులర్పించారు.

యువకుడి ఆత్మహత్య

పర్వతగిరి : మండలంలోని పెద్దతండాకు చెందిన భూక్య యాకూబ్ (45) రేకుల షెడ్డులోని ఇనుప పైపునకు లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై బోగం ప్రవీణ్ కథనం ప్రకారం.. యాకూబ్ పెద్దతండాలోని ఇంట్లో ఉండగా పక్కింటికి చెందిన లూనావత్ మోతీలాల్ ఐస్‌క్రీమ్ బండిలోని డబ్బులు యాకుబ్ దొంగిలించాడని ఆరోపించడంతో గొడవ చోటు చేసుకుంది. దీంతో మనస్థాపానికి గురై యాకూబ్ ఉరి వేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నివాళి

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన షేక్ నూరొద్దీన్ (70) శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడైన మండల మాజీ కో ఆప్షన్ మెంబర్ షబ్బీర్ పాషాను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి సొసైటీ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు,

నకిలీ విత్తనాలపై నజర్

- అప్రమత్తమైన అధికారులు
- ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు
- రైతులకు పలు అంశాలపై అవగాహన

ఐనవోలు : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు విత్తనాల కొనుగోలుకు సన్నద్ధం అవుతున్నారు. నకిలీ విత్తనాలకు తావివ్వకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు ఇదే అదనుగా భావిస్తున్న కొందరు దళారులు రైతులను మోసం చేసేందుకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు మార్కెట్‌లో చలామణి చేసేందుకు ప్రయత్నం చేస్తుంటారని, వారి ఆగడాలను తిప్పికొటేందుకు రైతులు సైతం జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా కొంతమంది స్వార్థ విత్తన వ్యాపారుల, దళారుల దగాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. పోలీసులు, వ్యవసాయ అధికారులు ఫర్టిలైజర్ దుకాణాల్లో సోదాలు నిర్వహించి నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నా ఎక్కడో ఓ చోట నకిలీ విత్తనాలు రైతులకు నష్టం మిగులుస్తున్నాయి.



పత్తి విత్తనాలను ఖరీదు చేస్తున్న రైతులు

పత్తి, కూరగాయాల సాగు ఎక్కువ

మండలంలో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయల పంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. నకిలీ విత్తనాలు, కేంద్రం నిషేధించిన బీటీ–3 విత్తనాలను కొనుగోలు చేయవద్దని, లైసెన్సు కలిగిన వ్యాపారుల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, ఆదమరిస్తే మొదటికే మోసం వస్తుందని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

రసీదు భద్రపరుచుకోవాలి



రైతులు విత్తనాల కొనుగోలు చేసిన అనంతరం బిల్లులు తప్పనిసరిగా విక్రేతల నుంచి తీసుకోవాలి. లైసెన్స్ కలిగిన డీలర్ వద్దే కొనుగోలు చేయాలి. బిల్లుపై విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్‌నంబర్, లాట్ నంబర్, రేటు ఉండేలా చూసుకోవాలి. తయారైన తేదీని కాలం ముగిసే తేదీని తప్పనిసరిగా పరిశీలించాలి. ఎమ్మార్పీ కంటే ఎక్కువగా అమ్మితే నేరుగా మాకు సమాచారం ఇవ్వాలి. పక్క జిల్లా, రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి ఎవరైనా నకిలీ, లూస్ విత్తనాలు అమ్మితే ఫిర్యాదు చేయాలి. మండలంలోని అన్ని సీడ్, ఫర్టిలైజర్ షాపుల్లో స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులను తప్పని సరిగా తనిఖీ చేస్తున్నాం. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు కూడా వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి.

– సునీల్ కుమార్, ఏఓ

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం



కమలాపూర్ : నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హరికృష్ణ, ఏఓ రాజ్‌కుమార్ హెచ్చరించారు. ఏఓ రాజ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం మండలంలోని పలు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్, డెలివరీ రిజిష్టర్లు, బిల్లు బుక్కులు, ఇతర రికార్డులు పరిశీలించారు. నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించి రైతులను మోసగించాలని చూసే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

రైతులు ఈ సూచనలు పాటించాలి

- ముందస్తుగా విత్తనాలు మొలకెత్తే శాతాన్ని ప్యాకెట్‌పై చూసుకోవాలి.
- విత్తనాలు విత్తిన తర్వాత తప్పని సరిగా ప్యాకెట్లను, రసీదులను భద్రపరుచుకోవాలి.
- ధ్రువీకరణ సంస్థ పేరు, చిరునామా స్పష్టంగా ఉందో లేదో చూసుకోవాలి.
- సరిగా సీల్ వేసి, ధ్రువీకరణ పత్రం ఉన్న బస్తాల్లోని విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి.
- విత్తన రకం, పేరు, లాట్ నంబర్, ఇతర గుర్తింపు చిహ్నాలు ఉన్నాయో లేవో చూసుకోవాలి.
- విత్తనం ఎంతకాలం వరకు ఉపయోగించుకోవచ్చో తెలిపే సమాచారాన్ని చూడాలి.

ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి

- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

ఎల్కతుర్తి : కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థను పెంచిపోశించేందుకే మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో హతమారుస్తుందని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంట్లపై సుప్రీమ్ కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రవాద నేరస్తులను పట్టుకోలేని కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పేరుతో ఆదివాసీలను, మావోయిస్టులను హత్యచేసి గర్వంగా ప్రకటించుకోవడం ఫాసిస్టు నీతికి నిదర్శనమని మండిపడ్డారు. అడవులను కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యంతో మోదీ సర్కార్ తలపెట్టిన 'ఆపరేషన్ కగార్' నేడు హత్యకాండకి బహిరంగ లైసెన్స్‌గా మారిందని విచారణ వ్యక్తం చేశారు. మావోయిస్టు జాతీయ నాయకుడు కేశవరావు అనారోగ్యంతో ఒడిస్సాలో చికిత్స పొందుతున్న సమయంలో పోలీసులు పసిగట్టి అదుపులోకి తీసుకుని చిత్రహింసలకు గురిచేసి హత్యచేశారని ఆరోపించారు. శాంతి చర్చలు జరుపాలని పదే పదే కోరుతున్న సమయంలో ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం బీజేపీ విధానానికి నిదర్శనమన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని మేధో వర్గాలు, ప్రజాతంత్ర వాదులు, బుద్ధి జీవులు, ప్రజాస్వామిక వాదులు గళం విప్పుతున్నా మోదీ, అమిషా పెడచెవిన పెట్టి చంపడమే మార్గమనే విధంగా అవలంభించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన క్రూర నేరస్తులను బంధించి శిక్షించడానికి లేని శ్రద్ధ శాంతి చర్చల్ని కోరుతున్న మావోయిస్టు పార్టీ మీద ఉడడం హేయమైన చర్య అన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు రాజ్‌కుమార్, విజయ్, మనోహర్, చంద్రమౌళి, మోహన్‌రెడ్డి, స్వామి, కృష్ణాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి

శాయంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కొప్పుల, కాట్రపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. కొప్పుల గ్రామశాఖ అధ్యక్షుడిగా ఏరుకొండ శంకర్, ఉపాధ్యక్షుడిగా మామిడి, కాట్రపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా వాంకుడోతు జగన్, ఉపాధ్యక్షుడిగా ఆరే కమలాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజేస్ అడ్వైజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాశ్, నాయకులు చల్లా చక్రపాణి, అబ్బు ప్రకాశ్‌రెడ్డి, మారేపల్లి రవీందర్, దుబాసి కృష్ణమూర్తి, పోతు కృష్ణమూర్తి, రఘుసింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఐ పోరాటం

- జిల్లా సహాయ కార్యదర్శి భిక్షపతి

శాయంపేట : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి భిక్షపతి అన్నారు. మండలంలోని పెద్ద కోడెపాక రెవెన్యూ శివారులోని గుడిసెల వద్ద ఆ పార్టీ 2వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పాలనలో విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంపై మోదీ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పారదర్శకంగా చేపట్టి అర్హులైన పేదలకు అందించాలని, గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం జరిగిన పోరాటంలో సీపీఐదే అగ్రగామి పాత్ర అన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ, పట్టణాల్లో సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై, పేదలకు ఇళ్ల స్థలాల కోసం సీపీఐ రాజీలేని పోరాటం చేసిందని గుర్తుచేశారు.



మాట్లాడుతున్న భిక్షపతి

మండల కమిటీ ఎన్నిక

మండల కార్యదర్శిగా బత్తిని సదానందం, మండల సహాయ కార్యదర్శిగా అనుకారి అశోక్, సముద్రాల రవి, 9మంది కార్యవర్గ సభ్యులను, 18 మందితో మండల కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు సాంబయ్య, వల్లాల రమేశ్, మైనొద్దిన్, సాంబయ్య, రమాదేవి, గౌసియా, రమాదేవి, కోమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇళ్లు నిర్మించుకోవాలి..

- గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీందర్
- పరకాల, శాయంపేటలో సమావేశం

పరకాల/శాయంపేట : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అర్హులు ఎక్కువ ఖర్చు పెట్టకుండా, నిబంధనల మేరకే నిర్మించుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీందర్ స్పష్టం చేశారు. శుక్రవారం పరకాల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో, శాయంపేట ఎంపీడీఓ కార్యాలయంలో వేర్వేరుగా జరిగిన మండల స్థాయి కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా పీడీ రవీందర్ హాజరై మాట్లాడారు. ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల జాబితా, నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రభుత్వ నిబంధనల మేరకు జరిగేలా చూడాలని ఇందిరమ్మ కమిటీలను, పంచాయితీ కార్యదర్శులను కోరారు. నిబంధనలు అతిక్రమించకూడదని అన్నారు. ఆయా సమావేశాల్లో పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, పరకాల లేబర్ అధికారి జి.వినోద్‌కుమార్, హౌజింగ్ ఏఈ ఆకాంక్ష, శాయంపేట తహసీల్దార్ కల్వాల సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ పీడీ రవీందర్

కెనాల్‌లోకి దూసుకెళ్లిన కారు



దామెర : ఎస్సారెస్పీ కెనాల్‌లోకి కారు దూసుకెళ్లిన ఘటన మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు పురోహితులు గూడెప్పాడ్ నుంచి హనుమకొండకు కారులో వెళ్తున్నారు. అయితే ఒగ్లాపూర్ సమీపంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఎస్సారెస్పీ కెనాల్ విస్తరణ పనులు జరుగుతున్నాయి. కాగా అక్కడికి రాగానే కారు అదుపుతప్పి కెనాల్‌లోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు పురోహితులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో కారు ధ్వంసమైనట్లు తెలిసింది.

విద్యార్థులకు ప్రాథమిక విద్య కీలకం

- జిల్లా మానిటరింగ్ అధికారి సుజన్‌తేజ

వర్ధన్నపేట/గీసుకొండ/సంగెం/పర్వతగిరి : విద్యార్థుల భవిష్యత్‌కు ప్రాథమిక విద్య కీలకమని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) సుజన్‌తేజ స్పష్టం చేశారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద, సంగెం, గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ పరిధిలోని ధర్మారం, పర్వతగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను శుక్రవారం ఆయన వేర్వేరుగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యాబోధన మరింత పటిష్ఠం చేయడానికే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారుతారని వివరించారు. ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంచుకుని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. మొదటి సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ధర్మారం ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర పరిశీలకుడు చైతన్య పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంఈఓలు మామునూరు శ్రీధర్, రాము, సాంబయ్య, గాయపు లింగారెడ్డి, ఆర్పీలు సదానందం, పరిపూర్ణాచారి, చరణ్, శివకుమార్, రమాదేవి, ప్రసూన, మహేశ్‌నాయక్, నరసింహారాములు, రాయపురెడ్డి, ఏకాంబరం, సాంబమూర్తి, శివప్రసాద్, శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : మాట్లాడుతున్న సుజన్‌తేజ

ధాన్యం కొనుగోలులో వేగం పెంచండి



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

- తహసీల్దార్ రాజ్‌కుమార్

నెక్కొండ : ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని నిర్వాహకులను తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఓ నాగరాజు, ఏపీఎం శ్రీనివాస్‌లతో కలిసి తహసీల్దార్ రాజ్‌కుమార్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని ప్రత్యక్షంగా పరీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనేందుకు సిద్ధంగా ఉందన్నారు. రైతులు ఆందోళనకు గురి కావొద్దని సూచించారు. మరో రెండ్రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న క్రమంలో ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు, పాలిథిన్ షీట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల మండలంలో కురిసిన వర్షానికి 97 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోగా వాటిని కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామని వివరించారు.

పంట సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి



పరకాల : రైతులకు అవగాహన కల్పిస్తున్న రాజిరెడ్డి



కమలాపూర్ : రైతులతో మాట్లాడుతున్న ఓంప్రకాశ్



నడికూడలో..

కమలాపూర్ : రైతులు పంట సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని వరంగల్ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఓంప్రకాశ్, డాక్టర్ మాధవి సూచించారు. మండలంలోని గూడూరు రైతు వేదికలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు మాట్లాడారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలంటూ పచ్చిరొట్ట ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఏఓ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. పంట కాలం ముగిసిన తర్వాత పంట అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కలియ దున్నాలన్నారు. రైతులు తొందరపడి ఇప్పుడే విత్తనాలు విత్తవద్దని, మరో మూడు వర్షాలు పడి భూమి తడిసిన తర్వాతనే విత్తనాలు విత్తాలని సూచించారు. హెచ్‌టీ విత్తనాలు, లూస్‌గా విక్రయించే విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి, వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, ఏఓ ఎండీ.అఫ్జల్ పాషా, ఏఈఓ ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఏఓ పోరిక జైసింగ్, శాస్త్రవేతలు డాక్టర్ మధు, డాక్టర్ హరి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ మోతాదులో యూరియా వాడకం, సాగు ఖర్చులను తగ్గించడం, అవసరం మేరకు రసాయనాల వినియోగం, రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల రసీదులపై, పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రామకృష్ణ, ప్రశాంత్, ప్రదీప్, కిన్నెర చికిత, వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

పరకాల : పంట మార్పిడితో నేల ఆరోగ్యంగా ఉంటుందని పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పంటల సాగుపై శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్.రాములు, డాక్టర్ పి.ప్రశాంత్, రైతు ప్రతినిధి యాదగిరి, ఏఈఓ శైలజ, వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులాల మూసివేత నిర్ణయం సరికాదు

శాయంపేట : దళిత విద్యార్థులపై ఎస్సీ గురుకులాల సెక్రటరీ వివక్ష చూపడం సరికాదని బహుజన స్టూడెంట్స్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద సురేశ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ గురుకులాలకు సంబంధించి 12 జూనియర్ కళాశాలలను మూసివేయాడానికి ఎస్సీ గురుకుల సెక్రటరీ వర్షిని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ సంక్షేమం కోసం, ఎస్సీ విద్యార్థుల కోసం పెద్దపీట వేస్తున్న తరుణంలో సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి జోగులాంబ, గద్వాల, కరీంనగర్, చొప్పదండి, ఖమ్మం, మహబూబాబాద్, సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, మేడ్చల్, మల్కాజిగిరి ఎస్సీ గురుకుల కళాశాలల్లో సరిపడా విద్యార్థులు లేరనే సాకుతో మూసివేయడం హేయమైన చర్య అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సెక్రటరీ ఈ విషయం తెలిపారని, 2025 విద్యా సంవత్సరంలో ఆ గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. సెక్రటరీ వర్షిని నిర్ణయంపై దళిత విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎస్సీ గురుకులాలను కొనసాగించాలని కోరారు.

'ఇందిరమ్మ' ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి



పర్వతగిరి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండలంలోని జమలాపురంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద 20 ఇళ్లకు ముగ్గు పోయగా 10 ఇళ్ల నిర్మాణం బేస్‌మెంట్ వరకు పూర్తయిందని చెప్పారు. మిగతా ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆరుగురికి మొదటి విడతలో రూ.లక్ష మంజూరు చేశామన్నారు. బేస్‌మెంట్ స్థాయిలో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తే ప్రతి సోమవారం రూ.లక్ష ప్రభుత్వం నుంచి అందుతుందని వివరించారు. బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన లబ్ధిదారులు, లెంటల్ లెవల్ పని చేసుకున్న వారికి రూ.లక్ష జమ అవుతాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణ పనుల్లో జాప్యం చేయొద్దని కోరారు.